నా గురించి...



పేరు : ఆలా వెలాంగిణి రాజు

తల్లిదండ్రులు : ఆలా అనసూర్యమ్మ, ఆలా జోసఫ్

విద్యార్హత : యమ్.ఎ., బి.యిడి.

వృత్తి : తెలుగు ఉపాధ్యాయులు

అన్నదమ్ములు : ఆలా శ్రీనివాసరావు, ఆలా నాగేశ్వరరావు (అన్నయ్యలు)
ఆలా శివప్రసాద్ (తమ్ముడు)

భార్య : అనూష

సంతానం : ఆలా దివ్య తేజస్వి (కుమార్తె)
ఆలా లోకేష్ బాబు (కుమారుడు)


విద్యాభ్యాసం

ప్రాథమిక విద్య : ఆర్.సి.యం. ఎలిమెంటరీ స్కూల్, ఫిరంగిపురం

ఉన్నత విద్య : సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాల, ఫిరంగిపురం

కళాశాల విద్య : హిందూ కళాశాల, గుంటూరు
ఫాతిమా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, దాచేపల్లి
డి.యన్.ఆర్. కళాశాల, భీమవరం

చిరునామా : అల్లంవారి పాలెం
డోర్.నెం. 15-141, ఫిరంగిపురం మండలం
గుంటూరు జిల్లా - 522 529
చరవాణి : 9948559171



ఒక మలుపు

ఆలా వెళాంగిణి రాజు

ఒక మలుపు

(వచన కవితా సంపుటి)

కర్త

ఆలా వెళాంగిణి రాజు

ప్రథమ ముద్రణ: జనవరి, 2025

మూల్యం : అమూల్యం

ప్రతులకు:

ఆలా వెళాంగిణి రాజు

అల్లంవారి పాలెం, డోర్. నెం : 15-141

ఫిరంగిపురం మండలం

గుంటూరు జిల్లా -522529

చరవాణి: 9948559171.

ప్రచురణ: ఏంజల్స్ ప్రచురణలు,
H.no: 3-79,
ప్రత్తిపాడు, గుంటూరు,
సెల్: +91 9010693883.
మెయిల్: vipparlasuneethapraizy@gmail.com

ముందు మాట

~ ~ ~ ~



నా ప్రియ మిత్రుడు ఆలా వెలాంగిణి రాజు గారి పుస్తకానికి నేను ముందు మాటగా రాయడం అనేది ఇది నా మిత్రుడు నాకు ఇచ్చే గౌరవానికి సూచికగా నేను భావిస్తున్నాను. అందులకు గాను ముందుగా నా ప్రియ మిత్రునికి మనసారా ధన్యవాదములు తెలుపుకొంటున్నాను. ఆలా వెలాంగిణి రాజు గారు గుంటూరులోనే ప్రఖ్యాతి గాంచిన లొయోలా పబ్లిక్ స్కూల్ లో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తూ, సమాజానికి తన వంతు సహాయకారిగా వుండాలని "కొండవీడు రచయితల సంఘం" అనే సంస్థలో కార్య నిర్వాహక సభ్యునిగా పదవిని చేస్తూ, తన రచనల ద్వారా ఎంతో కొంత ఈ సమాజానికి మేలు చేయాలని భావించి, సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకొని తన గెలుపును ఒక మలుపుగా తిప్పగలిగిన పుస్తకం ఈ " ఒక మలుపు".

ఈ పుస్తకంలోని ప్రతి పంక్తిని నేను క్షుణ్ణంగా చదివి వ్రాస్తున్నాను. కవి మిత్రుడు పుస్తకం మొత్తం కొత్త పదాలతో, కొత్త వాక్యాలతో, కొంగొత్త అర్థాలతో పుస్తకం మొత్తం పరుగులు పెట్టించాడని ఈ సందర్భముగా మీ అందరికీ సవినయంగా తెలియ పరచుచున్నాను. తన చదువును, జ్ఞానాన్ని, తెలుగు భాష మీద తనకున్న మక్కువను ఈ పుస్తక రూపంలో భావ వ్యక్తీ కరణ చేశారు మన కవి మిత్రుడు. ఈ పుస్తకం మొత్తం చదివితే కవి చెప్పదలచుకున్న అనేక కోణాలు మనకు దర్శనమిస్తాయి. కవి మిత్రుడి గెలుపు ఆయనకు మలుపునిస్తే, ఈ పుస్తకం చదివిన మనకు ఆ గెలుపుకు అర్థం ఏమిటో, దాని పర్యవసాన మలుపు ఏమిటో మనకు తెలుస్తుంది. కుటుంబ విలువలు, బాంధవ్యాల గురించి రాసినా, మనిషి మాయ మయ్యాడని

చెప్పినా, ప్రేమ బాసలు పలికినా,ఎన్నో ఒంటరి ప్రయాణాలు చేసి, తెలుగు భాషపై ధ్యాసను పెంచుకొని జీవ వైవిధ్యంలా తెలుగును వెలిగించే భావనతో శాంతి ప్రయాణం చేస్తూ, తెలుగు పదాల స్వప్న విహారిలా విహరిస్తూ, మధుర క్షణాలను ఇవ్వాలని తపిస్తూ, తన మది ఘోషను వివరిస్తూ, వరలక్ష్మీ వ్రతంలా నిత్య పదాల అల్లికలు చేస్తూ జల్లెడ పట్టి రాసిన పుస్తకమే " ఒక మలుపు" పుస్తకం. ఈ పుస్తకానికి ముందు మాట రాసే అవకాశం నాకిచ్చినందుకు నా ప్రియ మిత్రుడికి మరొక్కసారి ధన్యవాదములు తెలుపుకొంటూ, తనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలుపుతూ, ఇలాంటి పుస్తకాలు తన నుండి మరెన్నో రావాలని కాంక్షిస్తూ, అందరికీ నమస్కారములు తెలుపుకుంటున్నాను.ధన్యవాదములతో...

మీ...

సయ్యద్ మహమ్మద్ రఫి

కవి,రచయిత,మోటివేటర్

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత

కొండవీడు రచయితల సంఘం అధ్యక్షులు

వేములూరుపాడు

ఫోన్: 9032380696

సమీక్ష



సహజకవి దుబ్బలదాసు.

యం.ఏ. తెలుగుసాహిత్యం,

రిటైర్డ్ పోలీస్ సబ్ఇన్స్పెక్టర్,

ఇందిరా నగర్, డోర్. నం.33-55,

వినుకొండ, పిన్-522647,

పల్నాడుజిల్లా. ఆంధ్రప్రదేశ్,

ఫోన్.9885532923.

ఈ గ్రంధాన్ని కవి తన మనసులో దాగున్న తన భావాలోచనను పలు కవితలలో ఇమిడ్చి "ఒక మలుపు" అని నామకరణం చేశాడు. కవి అంటేనే కష్ట జీవి. మరి కవిగా ఆలా వెళాంగిణి రాజు తన ప్రతిభను సాహితీ క్షేత్రంలో కమ్మని సమాజపు తీరుతెన్నులకు ఆలోచించి కవితా పంట పండించారు. వీరు బతుకు దెరువులో బడి పంతులు. నిత్యం యాజమాన్యంతో విసిగి పోక పెద్దల యెడ వినయ విధేయతలు చూపుతూ తన విదార్థులకు పాఠాలు చెప్పుటలో నిష్ణాతుడై, వేళ మరువని అధ్యాపకుడై నిత్యం సమాజపు వెలుగు నీడలలో నడయాడుచున్న ఉత్తమ ఉపాధ్యాయులు. వీరు పనిచేస్తున్న నల్లపాడు లొయోల విద్యాలయం పేరున్న గొప్ప పాఠశాల. విద్యార్థుల జీవితానికి మూలమైన చదువు అందించే జ్ఞాన క్షేత్రం.

రచయిత, కవియైన ఆలా వెళాంగిణి రాజు గారి పుణ్య మాతా పితలు ఆలా అనసూర్యమ్మ, పకీరయ్యలు, భార్య కొమ్మనబోయిన తిరుపతమ్మ వీరి ఆనందానుభూతిన అమ్మాయి దివ్య తేజస్వి, కుమారుడు లోకేష్ బాబు ఉదయించారు. వీరిది తాతల నుండి నేటికి పిరంగిపురం స్వస్థలమై జీవిస్తున్నారు. ఈ "ఒక మలుపు" అందమైన అట్టలో చదవాలని పించే పొత్తము.

చాలా మంది కవులు తమ రచనలను చదివి, వినిపించే తీరు ఒకరకంగా విసుగును కలిగించే స్థాయిలో తమ కవిత్వం వినిపిస్తారు. కాని ఇక్కడ వెళాంగిణి రాజు గారు అలా చేయలేదు. తన మటుకు తాను తన భావంలో ఉన్న అలతి పదాలను అర్థవంతంగా వివరించాడు చూడండి. గడిచిన కాలంలో ఉమ్మడి కుటుంబం, వాటి తీరుతెన్నులను ఇలా తలపుకు తెచ్చాడు.

“అమ్మమ్మా నాయనమ్మ
తాతయ్యల పెద్దరికంలో
ప్రేమించడం ప్రేమను పంచడం
అనుబంధాలను ఆత్మీయతలను ..”

నేర్చుకున్నామని అనుబంధాల విలువలు గురించి చెప్పడం ఎంతో ఆనందమో కదా. మనిషి మాయమైపోయాడు. నిజమే నేడు పలకరింపుకు దూరంగా ఉంటూ తన బ్రతుకును తాను బ్రతుకుతున్నాడు మనిషి. నిజమే నేడు సమాజంలో క్రూరత్వం, రాక్షసత్వం మంట గలిపి క్షణికావేశంలో ఆహుతౌతున్నాయి నిజమే కదా.

"పేదవాడినేస్తం"

పేదవాడి శరీరం
శారీరక శ్రమతో నలిగి
శరీరానికి చల్ల గాలి సోకి
వైద్యుని వలె వైద్యం అనే నైవేద్యాన్ని అందిస్తుంది
గుడిసె వాకిట్లో రాత్రి నులక మంచపై పడుకోగానే
ఆకాశ నక్షత్రాలు పలకరించి పరిచయమౌతాయి”

కవి ఆకాశ నక్షత్రాలను అందాల భామలతో పోల్చడం ఓ సందర్భం పేదవాడికి.

"గెలుపు ఓ మలుపు" జీవితమంటేనే ఓ ఆట. మలుపు లేని గెలుపే లేదు భువిలో.

మానసిక ఆరోగ్యానికి మనోధైర్యం ఆత్మ విశ్వాసమే సిసలైన మందు. మూఢ నమ్మకాల మాయ మత్తులో పడి మనిషి చిత్తవుతున్నాడు.

"నడకలో నడత" సవాళ్ళతో నిండినదే ఈ మానవ జీవితం. గెలుపోటముల సమ్మేళనమే ఈ జీవన పోరాటం. నిరాశ నిశీధిలో జీవితాన్ని గడపక ఆశల వెలుగులో నడిపించేదే నిండైన నిజమైన జీవితం. ఇది మనిషి నడకలో నడతంటున్నాడు రాజుగారు.

"భయానికి భయపడకండి" ఈ అనంత విశ్వ జీవనంలో మనిషి నిజంగానే భయంతో బ్రతుకుతూ చస్తున్నాడు. కవితను తనకు కలిగిన పరిష్కారాన్ని ఇలా చూపించాడు.

“నిశబ్ధ రూపంలో నిలువెత్తు తాపమై
తనువంతా చుట్టేసి
దేహం లోపల దడ పుట్టించి
తరిమి కొట్టి పిచ్చి వాడిని చేసేది భయం
ఆ భయానికి భయపడకండి”

అని నిర్వచించి, సమాధాన పర్చడం రచయిత బాధ్యతను వివరించారు.

"కాలమే సమాధానం"

ఇక్కడ కవి తన అనుభవ సారాన్ని మనముందుంచారు. సంపాదనే ధ్యేయంగా బతుకుతున్నవాడికి రక్త సంబంధం, స్నేహ బంధం విలువలు పలుచగానే కనిపిస్తాయి మరి.

తనువులో నిలువెల్లా విషం, స్వార్ధం ఉండి పెదవులపై మాత్రం నడయాడే ఖర్చులేని మాటల తూటాలతో కుత్రిమ ప్రేమ.

"అగ్ని కిరీటం"

సాహితీ క్షేత్రంలో ఓ ఉన్నతమైన వ్యక్తి వారు. కవిగా అక్షర తుణీరము నందు వివక్షత నెదిరించే ఆయుధాలను సవ్యసాచి తానై తన జీవితం అంటరానితనం నిర్మూలనకై తన జీవితాన్ని ధార వోశాడు. నవయుగ కవి చక్రవర్తి డా. గుఱ్ఱం జాషువాను తలచుకుంటూ ఇలా కవి తలపులు.

"సాహితీ క్షేత్రంలో
సువిశాల కవిత పంటను పుడమిలో
కలమనె హలంతో
సేద్యము నెంతో చోద్యంగా
సాధ్యమయ్యేటట్లు చేసి
నవయుగానికే నవ్యమైన నడక నెంతో ఓర్పుగా నేర్పి
నవయుగ కవితా చక్రవర్తి వయ్యావు"

అని జాషువను తలచుకోవడం కవికి గురు భావం మెండుగా ఉంది.

"తెలుగు భాషపై ధ్యాస"

అవును ప్రతి ఆంధ్రీయుడు తన మాతృభాష తెలుగని గుర్తుంచుకొని భాషను కాపాడు కోవాలన్న తపన కవి వేదన.

"వెన్న కన్నా మెత్తనైనది
మల్లె కన్నా మత్తైనది
తేనె కన్నా మధురమైనది
మన తెలుగేనన్నా
అమ్మ పాల రుచుల
అక్షరాల తెలుగు.." వెలుగంటూ గర్వంగా తెనుగక్షరాల రుచిని అందించాడు వెళాంగిణి రాజు కవి.

"జీవ వైవిధ్యం"

ప్రకృతి వినాశకారి ఎవరు? ప్రకృతి చేత ప్రసాదించబడిన జీవామృతాన్ని, జీవ వైవిధ్యాన్ని నేడు మనిషి యంత్రములా మారి యధేశ్చగా నాశనం చేస్తున్నాడు. ఇలా పరోక్షంగా జీవనాధారమైన ప్రకృతిని నాశనము చేయకండి సోదరులారా అని ప్రాధేయపడుతున్నాడు కవి.

"గురజాడ నీవు మాకు అడుగుజాడ"

తేట తెనుగును సానబట్టి

అక్షరాలన్ని కూడగట్టి

యుగయుగాలు పాడుకొనే విశ్వగీతం

ఒకటి పాట గట్టి

ఘనత గాంచిన గురజాడ

నీవే మాకు అడుగుజాడ" అంటున్నాడు వెళాంగిణి రాజు కవిగా.

అరువది ఏండ్ల పండుగ -

సాధారణంగా సంవత్సరంలో అన్ని మతాలకు పండుగలు వస్తాయి. నేడు ఈ పండుగ అరువదేండ్లైనది అంటే కుల మతాలకు అతీతమై విద్య నందించే పాఠశాలకు ఘన నివాళే.

క్రమశిక్షణకు పట్టుగొమ్మగా

కట్టుబాటుకు చెరగని ముద్రగా

సర్వమత సమైఖ్యభావాన్ని పంచుతూ

సర్వసమాన ఐకమత్యాన్ని చాటుతూ

మునుముందుకు పోతుంది

మన లోయోల పాఠశాల" అని గర్వంగా రొమ్ము గుద్ది పాఠశాల గుణాన్ని చెప్పారు. ఇంత అభిమానాన్ని తన హృదయంలో దాచిన కవికి అభినందనలు.

"గురువు నిత్య పూజ్యులు"

కన్నతల్లి మొదట గురువైతే ఐదేండ్ల ప్రాయం రాగానే విద్యార్జనకు పాఠశాల నందు విద్యాబోధనకై అక్షరాలను అందించే జీవ నాడి గురువు అలా గురు పూజ్యతను ప్రస్తుతించాడు కవి.

"గురువంటే గుండె బరువును దించి
విజ్ఞానాన్ని పంచేవాడు.
గురువు బ్రహ్మచే మలచ బడి సృష్టించబడిన వాడు
అతడు లయకారుడైన విష్ణువే" అని తన పూజ్యతను ఇచ్చట అభిషేకించాడు కవి.

"మహిళామణి"

స్త్రీలు మాతృమూర్తులై గృహాలను వెలిగించి, సమాజపు వెలుగై గౌరవాన్ని పొందుతుంది.

"సంస్కృతి సాంప్రదాయాలకు నీవేగా నిలయం
నా భారతదేశం సాంప్రదాయ అలవాట్లకు నిర్దేశం
మీదేగా ఈ అవని
పన్నీరైనా కన్నీరైనా
మీ కరుణతోనే కదా తరుణి" అని మహిళల గౌరవాన్ని ఎంతగానో అభినందించాడు.

"వరలక్ష్మీ వ్రతం"

పంట చేలో తోలే పైరు గాలిలా
తొలి ప్రొద్దు వేకువ జామున
సుప్రభాత గీతంలా

మలి సంధ్యా సమయాన

లేత అరుణ కిరణమై వెలుగులా

తామరాకుపై ఉలికి పోయె మృధువైన నీటి బింధువులా

నిండు పున్నమి వెన్నెల జాబిల్లిలో

విరబూసిన బొమ్మలా

ఎంత అందంగా ఉన్నావో ముద్దుల గుమ్మ.

అప్పుడే తీసిన వెన్నపూసలా

నిండు జాబిల్లి కూడా నివ్వెరపోయెలా.."

కవి తన హృదయంలో దాగిన బావ పరంపరను అక్షరాలతో అల్లిన కవిత్వం "ఒక మలుపు." అనేకాలోచనల సారం తనదైన నవ మార్గంలో రచించి మనకు అందించిన కవితలలో ఓ నూతనత్వాన్ని, తాను ఎటూ దారి తప్పక తన దారిలో తన అనుభవాల సంకలనమే ఈ అనందానుభూతుల గ్రంధం "ఒక మలుపు." రాజు గారి ఆలోచనలు బాగుగా ఇమిడ్చిన ఈ గ్రంధం పాఠకుల చెంతకు చేరిన గ్రంధ మాధుర్యం రుచికందుతుంది.

శ్రీ ఆలా వెళాంగిణి రాజు తన మదిలో మెదిలే బావ తలంపులను సమాజానికై చక్కని రచనలు చేయాలని హృదయ పూర్తిగా కోరుకుంటున్నాను. సత్తా ఉన్న కలం సాహసిస్తుంది. చక్కని భావాలను రచన చేస్తుంది.....

** శుభం సమస్తం **

కవి మిత్రులందరికి నమస్సులు.

ప్రస్తావన



షేక్. ఖాజావలి

భాషా ప్రావీణ్య, తెలుగు టీ. పీ. టీ,

విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు, కండ్రిక,

ఫిరంగిపురం మండలం,

చరవాణి -9 9 6 3 2 4 2 8 1 9.

తెలుగు సాహిత్య చరిత్రలో పద్యం గద్యం ప్రాచీనమైనది. కవిత్రయాలు, అష్టదిగ్గజాలు అనేక ప్రబంధాలు రచించారు. శ్రీ కృష్ణదేవరాయల కాలము ప్రబంధయుగంగా ప్రఖ్యాతి గాంచింది. నాడు పద్యము గద్యము, ద్విపద, ప్రసిద్ధి చెందిన ప్రక్రియలు. ఆధునిక యుగంలో ముత్యాల సరాలు మాత్రా చంధస్సు కవితలు వ్రాయబడినవి. నేడు నానీలు, అభూజీలు అనే నూతన ప్రక్రియల ద్వారా కవిత్వం వెలువడుతుంది. అంత్య ప్రాసతో ఉన్న సాధారణ భావ ప్రధాన కవితలకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

వృత్తి రీత్య వీరు తెలుగు భాష ఉపాధ్యాయుడు. కాబట్టి వీరి హృదిలో కదిలిన, మదిలో మెదిలిన భావ పరంపరలు వెల్లువలై కవితల రూపాన పరుగులు తీసి, ఉరకలు వేసింది. శ్రీ ఆలా వెళాంగిణి రాజు కలం నుండి జాలువారిన కవితల సమాహారమే ఈ “ఒక మలుపు.” ఇందులో విభిన్న భావాలను వైవిధ్య రీతిలో విస్తృత పరిచి పాఠక మహాశయులకు పరమాన్నం భుజించినంత సంతృప్తిని అందించారు.

“పేదవాడి నేస్తం” కవితలు పేదవాడికి నిజమైన నేస్తం పగలు శ్రమ, రాత్రి నులక మంచం. పేదవాడు పగలంతా శ్రమించి కుటుంబాన్ని పోషిస్తాడు. రాత్రి నులక మంచం మీద సేద తీరుతాడు. నేటి తరానికి నులక మంచం తెలియదు. దానిని పరిచయం చేశాడు రచయిత. మరొకటి “భయానికి భయపడకండి” భయం అనే

మహమ్మారికి చిక్కకండి అని భయాన్ని విడిచిపెట్టి ధైర్యం అనే ఆయుధంతో ముందుకెళ్లండని హిత బోధ చేశాడు. "కాలమే సమాధానం" కవితలో మనిషి జీవితంలో కష్టసుఖాలు, లాభనష్టాలు, వ్యాధులు బాధలు వస్తుంటాయి. వాటిని ఓర్పుతో భరిస్తే వడ గాల్పుల జీవితంలోని వెన్నెల వెలుగులు వచ్చి సేద తీరుస్తాయని వక్కాణించాడు.

"జీవవైవిధ్యం" అనే కవితలో

"పల్లె పచ్చని పసిడి పంటను

పాతాళానికి తొక్కిపట్టి .."

ప్లాట్ల పేర్లతో బంగారు పంటలు పండించే భూములు ఆక్రమించి, పల్లె అందాలు పాతాళానికి తొక్కేసారని తన ఆవేదనను తెలిపాడు. "గురువులు నిత్య పూజ్యులు" అనే కవితలో

"శిష్యుడు అనే విత్తనాన్ని నాటి

విజ్ఞానం అనే పంటను పండించా"డని చాలా గొప్పగా ఊహించి చెప్పిన తీరు అద్భుతం. "శాంతి ప్రయాణం" కవితలో మనిషి విజ్ఞానం పెరిగి, వెలుగును చూపిన ఆ పరిజ్ఞానమే నేడు అజ్ఞానంగా మారి అనంత లోకాలకు అవరోధం కలిగిస్తుందని మానసిక ఆందోళన చెందాడు.

"మతం కన్నా మానవత్వం మిన్న

మానవత్వం లేని మతం సున్నా" అంటూ మత మౌఢ్యాలతో కొట్టుకు చస్తున్న సమాజానికి ఆ పిచ్చిని తొలగించి, మానవత్వమే నిజమైన మతమని చాటి చెప్పాడు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. వాటన్నింటిని ఇక్కడ వ్రాయలేము కదా. అందుకే కొన్నిటిని ఉదాహరిస్తున్నా. రచయిత చేసిన ఈ ప్రయత్నంతోనే కవన

ప్రపంచంలో మరెన్నో వీక్షించటానికి, చదవడానికి, రాయటానికి ఒక మలుపును తిప్పాడని నేను అనుకుంటున్నా.

“సీ. మాటలో చతురుత మనసు గాంభీర్యత
ప్రాస యక్షరముల పరిమళించి
విలువల పలుకులు వెలదికి వలువలై
సరస సరస్వతి సాగి వచ్చి
కలువల కన్నుల మిలమిల మెరయగ
మనసారా దీవించి మమత బంచె
భావ ప్రధానంబు భాసించునట్లుగా
అయ్య ప్రాసలతోడ హడల గొట్టె

తే. పాతకోత్తముల మదిని పసిమి గట్టె
యుత్తమోత్తమ రచనల యునికి నెరిగి
చిత్త శుద్ధితో రచియించు మస్తు కవిత
కొత్త రచనలు జేయుము ప్రస్తుతించ”

ఆలా వారి శైలి అద్భుతం

ఆలా వారిది అదొక వరవడి



కవి, సాహిత్య రత్న, జాతీయ అవార్డు గ్రహీత.

యనమాల సుందర్,

బి.ఏ., ఇంగ్లీష్ లిట్, బి.ఇడి

ఫిరంగిపురం,

సెల్- 9676279507.

ఈ సాహితీ ప్రపంచంలో ఉన్న ఎన్నో రచన పద్ధతుల్లో వచన కవిత్వం ఒక పద్ధతి. సామాన్యులకు సైతం అర్థమయ్యే ఆస్వాదించేలా రచన చేయడంలో ఆలా వారిది అందె వేసిన చేయి.

ఆలా వెళాంగిణి రాజు గారు కేవలం ఈ పుస్తక రచయిత మాత్రమే కాదు కానీ దాదాపు 15 సంవత్సరాలు పైగానే ఎంతో మందికి విద్యా బుద్ధులు నేర్పి, వారి ఉన్నతికి కారణమైన ఓ సీనియర్ తెలుగు ఉపాధ్యాయుడు. ఇది మాత్రమే కాక ఎన్నో సాహితీ కార్యక్రమాలలో అలతి పదాలతో, అందమైన ప్రాసలతో, గాంభీర్యమైన స్వరాలతో సభికుల కరతాళ ధ్వనుల మధ్య ఆవృత్తాలను అలవోకగా నిర్వహించగలిగిన దిట్ట అని ఎన్నో మార్లు నిరూపించుకున్నారు. ఈ రోజున ఈయన కలం నుండి వెలువడిన ఈ మొదటిది కవి తా సంపుటిలో ఉన్న కవితలు ఈయన మదిలో భావాలకు అక్షర రూపం.

కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైపోతున్న నేటి కాలంలో పాతకాలపు రోజుల స్మృతులను అలా కళ్ళ ముందు నిలిపారు ఆలా వారు. తమ “ఉమ్మడి కుటుంబం” కవితలో మానవతా విలువలు నశించిపోతున్నాయని ఆక్రోశించి, మనిషిని మనిషిగా

చూడాలని ఆకాంక్షను వెలుబుచ్చారు తన "మనిషి మాయమైపోతున్నాడు" కవితలో. "నులక మంచం" కవిత పేదవాడి స్థితిని గుర్తు చేస్తూనే పట్టు పరుపులు ఇవ్వలేని సుఖాన్ని అందిస్తూ రాత్రికి అతని సేద తీరుస్తుందని చూపించారు. "భయానికి భయపడకండి" అంటూ చెప్పిన కవితలో ధైర్యాన్ని నూరి పోస్తూ ఆయన అభయ హస్తాన్ని ఇచ్చారు. విశ్వ కవి గుర్రం జాషువా గురించి రాసిన "అగ్ని కిరీటం" సంపుటికి ఓ మకుటం. "తెలుగు భాషపై ధ్యాస" కవితలో తెలుగును బతికించాలని ఆశ స్వతహాగా ఈయన తెలుగు ఉపాధ్యాయుడు కావటం చేత దానిని మరింతగా రక్తి కట్టించారు. జీవ వైవిధ్యంలో ప్రకృతిని కాపాడమని వేడుకోలు కనపడుతుంది. చదువు చెప్పిన గురువు గొప్పతనాన్ని గుండెల్లో దాచుకొని, గుర్తొచ్చినప్పుడల్లా చదువుకోమని "గురువు నిత్య పూజ్యుడు" కవితను సమాజానికి అందించారు.

ఆయా సందర్భాలలో ఆయా వ్యక్తుల గురించి వీరు రాసిన కవితల్లో వారి యొక్క వ్యక్తిత్వాన్ని మన కళ్ళ ముందు చూపించారు. మహిళా మణి, శాంతి ప్రయాణం, వరలక్ష్మి వ్రతం, అమ్మకు అభివందనం, కవితే నాతోడు, నింగిలో నిండు చందమామ, తల్లిదండ్రులు, సత్వర న్యాయం అని తమ మదిలో మెదిలే భావ అలలను పొంగించారు.

ఏది ఏమైనప్పటికీ ఈ కవితా సంపుటి అమూలాగ్రహం ఎన్నో కోణాలను స్పృశించిందనటంలో సందేహం లేదు. రానున్న కాలంలో ఈ యువ కవి పదునైన పదాలతో సమాజపు చీకటి కోణాలను చేధించాలని ఆకాంక్షిస్తున్నాను.

మనసులో మాట

ఈ సువిశాలమైన ప్రపంచంలోనున్న అద్భుతాలలో తెలుగు సాహిత్యం కూడా ఒకటి అనేది కాదనలేని నిజం. అటువంటి తెలుగు సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలైన పద్యం, గద్యం, అవధానం, నాటకం, కథ, కవిత్వం ఇలా మొదలైన వాటిని కలుపుకొని ముందుకు సాగిపోతూ తెలుగు వాడి తేజానికి నిదర్శనం అయినది తెలుగు సాహిత్యం. ఇలాంటి తెలుగు సాహిత్యానికి తెలుగు ఉపాధ్యాయుడిగానున్న నేను నా వంతు బాధ్యతగా ఒక వైపు విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ, మరో వైపు సమాజంలో జరుగుతున్న సంఘటనలకు, సమస్యలకు ప్రతిస్పందిస్తూ నా మదిలో కలిగే భావాల పరంపరను కవిత్వ రూపంలో పొందుపరిచి ఒక కవితా సంపుటి వేయాలనేదే నా తలంపు. నా దృష్టిలో సమాజం పట్ల బాధ్యత ఉన్న వాళ్లకు సమస్యలకు స్పందించే వాళ్ళకు, వాస్తవ లోకంలో విహరించే వాళ్లకు ఇలాంటి భావజాలం అలవడుతుందని నా అభిప్రాయం.

కవిత్వం అందించే వారిని కవి అంటారు. కవి అంటే కనిపించకుండా వినిపించేవాడు కవి అవుతాడు. అంటే కవిత్వం రాసిన తాను (కవి) ఎక్కడో ఉంటే చదువుకునే పాఠకుడు కవిత్వాన్ని ఇక్కడ అంటే చదివే చోట వినగలుగుతాడు. ఒక కవి మనసులో కలిగే బావ పరంపరను ఈ సమాజంలో వందలాది, వేలాది ఆపై ఇంకా ఎంతో మంది మనసుల్లోకి వెళ్లి ముద్ర పడుతుంది. అది మంచి కావచ్చు, చెడు కావచ్చు. అంటే ఈ సమాజానికి కవిత్వాన్ని అందించే కవికి గౌరవంతో పాటు బాధ్యత కూడా ఉంటుందని నేను మరో మారు గుర్తు చేసుకుంటున్నాను. కలాన్ని చేత పట్టి, కవిత్వాన్ని రాయబట్టి ఈ భావం ఉట్టి పడుతుంది.కవిత నా వెంట పడుతుంది. ఆపై భావం మనసుకి వంటపడుతుంది. బహుశా ఇదేనేమో! కలానికి, కవిత్వానికి, కవిత్వానికి నాకూ ఉన్న అవినాభావ అనుబంధం ఎంత కవిత్వం రాసినా తనివి తీరనిది ఈ అక్షర అనుబంధం అని నా మనసులో మాట.

కృతజ్ఞతలు

నా ఈ కవితా సంపుటి ముద్రణ రూపంలో రావటానికి ప్రధానమైన వ్యక్తి, ముందుగా కృతజ్ఞతలు తెలుపుకోదగిన వ్యక్తి, "కవిత్వం రాయటం గొప్ప కాదు ఆ కవిత్వం సమాజంలోకి పోయేలా చేయటమే గొప్ప" అని నన్ను పదే పదే మేల్కొలిపి "మనం లేకపోయినా మన కవిత్వం ఈ సమాజంలో బతికే ఉండాలి" అని నన్ను ప్రోత్సహించి నా ఈ కవిత్వానికి రూపాన్ని తెచ్చిన నా మిత్రుడు, సహోపాధ్యాయుడు, శ్రేయోభిలాషి **డా॥ డి.రమేష్** గారికి ప్రథమ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ముఖం చూడాలంటే ఎదురుగా అద్దం ఉంటే సరిపోతుంది. అప్పుడు మన ముఖం కనిపిస్తుంది. అదే మన మనసును చూడాలంటే ఎదుటి వ్యక్తి మనసున్న వ్యక్తి ఉండాలి. అప్పుడే మన మనసేమిటో తెలుస్తుంది. అలాంటి మనసున్న వ్యక్తి కొండవీటి రచయితల సంఘ అధ్యక్షుడు, ఈ నా **"ఒక మలుపు"** అనే కవితా సంపుటికి వారి ముందుమాటను రాయటం నా మలుపుకు ఒక గెలుపుగా భావిస్తున్నాను. వీరు **"తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత సయ్యద్ మహమ్మద్ రఫీ".** వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

అలాగే సంపుటి చదివి, తన అభిప్రాయాన్ని రాసి, నన్నాశీర్వదించిన వారు గురుతుల్యులు తెలుగు సాహిత్య సభలలో తరచుగా కలిసి, మా లాంటి వారిని తెలుగు సాహిత్యంలో ఉన్న అభిరుచిని చవి చూపిస్తూ సలహాలను, సూచనలు అందిస్తూ ఉండే **షేక్ ఖాజావలి** గారికి కూడా నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ పుస్తకాన్ని పూర్తి స్థాయిలో విశ్లేషణ చేసి తమదైన శైలిలో విస్తృతంగా సమీక్ష గావించిన వ్యక్తి, ఎక్కడ కనిపించినా నోరారా చిన్నోడా! రాజు!! అని ప్రేమగా

పిలిచే సహృదయ స్వభావులు, ఉన్నత సంస్కారులు, ప్రముఖ కవి, రిటైర్డ్ పోలీస్, సబ్ ఇన్స్పెక్టర్, జాషువా జన్మించిన గడ్డ వినుకొండలో జన్మించిన **దుబ్బల దాసు** గారికి కూడా హృదయపూర్వకమైన ధన్యవాదాలు.

మరో మిత్రుడు, చిత్రకారుడు, ఆశు కవితా ధారణ కురిపించ గల కవి, సాహితీ రత్న, ఎక్కడ కలిసినా ముందు కవిత్వంతోనే మా మధ్య యోగక్షేమాల సంభాషణ ప్రారంభమవుతుంది. అలాంటి కవి నా ఈ పుస్తకానికి సరికొత్తగా వారి అభిప్రాయాన్ని రాసి నన్ను ఆనందింప జేసిన జాతీయ అవార్డు గ్రహీత, **యనమాల సుందర్** గారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు.

నా కవితా సంపుటిని చక్కగా టైపు చేసి, చక్కగా డిజైను చేసిన **ఏంజల్స్ ప్రింటర్స్** వారికి, నా జీవన పోషకులు **లొయోలా పబ్లిక్ స్కూల్, నల్లపాడు** యాజమాన్యానికి, మా **కొండవీడు రచయితల సంఘం** సభ్యులకు, ఈ నా కవితా సంపుటికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన, సహాయపడిన వారందరికి ప్రత్యేకమైన ధన్యవాదములు తెలుపుకుంటున్నాను. ఇక దీనిని చదివి నన్నాశీర్వదించండి.

విషయ సూచిక

వ. సం	విషయం	పుట
I.	ముందుమాట	i
II.	సమీక్ష	iii
III.	ప్రస్తావన	xi
IV.	ఆలా వారి శైలి అద్భుతం	xiv
V.	మనసులో మాట	xvi
VI.	కృతజ్ఞతలు	xvii
1.	ఉమ్మడి కుటుంబం	1
2.	మనిషి మాయమైపోయాడు	3
3.	పేదవాడి నేస్తం	5
4.	గెలుపు - ఒక మలుపు	7
5.	నడకలో .. నడత	9
6.	భయానికి భయపడకండి	11
7.	కాలమే .. సమాధానం	13
8.	అగ్ని కిరీటం	15
9.	తెలుగు భాషపై ధ్యాస	17
10.	జీవ వైవిధ్యం	19
11.	గురజాడ నీవు మాకు అడుగు జాడ	21
12.	అరువది ఏండ్ల పండుగ	23

13. గురువు – నిత్య పూజ్యులు 24

14. మహిళా మణి 26

15. చిరు కవితా అక్షర మాల 28

16. ఉత్తమ ఉపాధ్యాయిని 30

17. సన్మాన చిరు కవితాక్షర మాల 32

18. చిరు కవితాక్షర మాల 35

19. శాంతి ప్రయాణం 37

20. వరలక్ష్మీ వ్రతం 39

21. స్త్రీ లేని లోగిలి నిర్వీర్యమై పోయిన వాకిలి 41

22. గురువులారా! వందనం 43

23. కవితే నా తోడు 45

24. విజ్ఞానపు గని 47

25. తల్లిదండ్రులు 49

26. నింగిలో నిండు చందమామ 51

27. రైతు బ్రతుకు 53

28. అన్నదాత 55

29. రైతు 59

30. సత్వర న్యాయం 60

31. అమ్మకు అభివందనం! వందనమమ్మా!! 62

1. ఉమ్మడి కుటుంబం

అమ్మమ్మ - నాయనమ్మ
తాతయ్యల - పెద్దరికంలో
ప్రేమించటం - ప్రేమను పంచడం
అనుబంధాలను, ఆత్మీయతలను
నేర్చుకుని...
పెద్దమ్మ పెదనాన్నల
బాబాయి చిన్నమ్మల
హుందాతనంలో బాధ్యతలను, విలువలను
సంతోషంగా స్వీకరించి...
నాన్న ఒడిలో
నైతిక విలువలను
సంస్కృతి, సాంప్రదాయాలను
అక్షరాలుగా దిద్దుకుని....
బావ - బావమరుదుల చిలిపి అల్లరుల
అనుభవసారంతో...
బంగారం లాంటి మనసున్న
బామ్మల ముచ్చట్లతో
కొసరి కొసరి తినిపించే
అత్తమ్మల చమత్కారాలతో
చుట్టరికాల పందిరి కింద
విలువల కలువలు విరబూసే

చిన్నమ్మల మమకారంతో
కన్నీళ్లు గడప దాటక ముందే
ఓదార్పు ఒడిలోకి తీసుకునే
అమ్మ లాలి పాటలతో
కల్మషాలను సైతం కలుపుకొని పోయే
నదీ ప్రవాహం
ఉమ్మడి కుటుంబాల గమనం..!
బంధాల నడుమ
బతకడం నేర్చుకున్న వాళ్ళే
భావి తరాల వాళ్ళకు బాధ్యతను పంచుతారు
మానవీయ విలువలను పెంచుతారు

****

2. మనిషి - మాయమైపోయాడు

నేటి సమాజంలో
క్రూరత్వం, రాక్షసత్వం పెరిగిపోయి
మానవత్వం మంట గలిసి
క్షణికావేశంలో ప్రాణాలు ఆహుతులవుతున్నాయి
బలహీనతలతో మనిషి
రాక్షస ప్రవృత్తితో పెట్రేగి
మానవుడు దానవుడై....
అకృత్యాలకు, అనర్థాలకు, హత్యలకు, అత్యాచారాలకు
దోపిడీ, దమన కాండలకు ఆజ్యం పోస్తూ
అహంకారం, అహంభావంతో
మానవత్వం మరిచిపోతున్నాడు!
నవ సమాజంలో
సామాజిక రుగ్మతలు పెరిగి
సామాజిక చింతన నిర్వీర్యమై
ప్రేమానురాగాలు, మానవ సంబంధాలు
కృత్రిమంగా మారుతున్నాయి!!
మనిషిలో కూరత్వం ప్రబలి
కరుణ, దయ, క్షమ గుణాలు నశించి
స్వార్థం, అసూయ, ద్వేషాలు, ఏహ్య భావాలు
రాజ్యమేలుతున్నాయి !!!

స్వతంత్ర జీవితం అలవాటయింది
సమిష్టి తత్వం అంతరించి
వ్యక్తి స్వార్థం పెరిగింది
 బాధలు పంచుకునే వాళ్ళు లేక
ఆందోళనలే ఆస్తులైనాయి
ఆత్మహత్యలే శరణ్యమైనాయి
అలకలు సంపదలైనాయి
మొత్తం మీద మానవత్వం ఉన్న మనిషి
మాయమైపోతున్నాడు
కాబట్టి ...
మమత, మానవీయత పరిమళాలు వెదజల్లే
ఆత్మీయత, అనురాగ సౌధాన్నీ నిర్మిద్దాం...!
ప్రగతికి బాటలు వేసి
భవితకు బ్రతుకుపై ఆశను కల్పించి
బ్రతికేలా చేద్దాం ...!!

****

3. పేదవాడి నేస్తం..!

పేదవాడి శరీరం
పగలు శారీరక శ్రమతో నలిగి
శరీరానికి చల్లని గాలి సోకి
చేయిదిరిగిన వైద్యుని వలే
వైద్యం అనే నైవేద్యాన్ని అందిస్తుంది
గుడిసే వాకిట్లో రాత్రి మంచం మీద పడుకోగానే
ఆకాశంలో నక్షత్రాలు
పలకరించి పరిచయం అవుతాయి..!
తమ మమతలతో అల్లుకున్న విడదీయలేని బంధం
పేదవాడికి నేస్తం.. అదే నులక మంచం ...!!
ఆ నులక మంచంపై నడుము వాల్చి
నిద్రలో జారుకుంటే చాలు
చేసిన కష్టమంతా మటుమాయం
పెద్దోడి పట్టె మంచం కన్నా
పేదోడి నులక మంచం
నిద్రలోని కొత్త అనుభూతుల్ని పరిచయం చేస్తుంది
తన శ్రమ విలువ ఎంతన్నది తెలియపరుస్తుంది
పట్టు పరుపు మంచంపై
నిద్ర రాని పగటి కలలతో కలత నిద్రలే
మిగులుతాయి ..!
పేదవాడి నులక మంచంపై

హాయి అయిన కమ్మటి నిద్రతో కూడిన
వెన్నెల రాత్రులే కలుగుతాయి..!!
నిద్రలో పేద వాడి మనసులో
రేపటి శ్రమ కోసం ఆశల పూల గుర్తుల
స్వాగతాలు పలుకుతాయి
 ఆకాశంలో చుక్కలన్ని వచ్చి
రాత్రివేళ నులక మంచం ముంగిట్లోకి వచ్చి
ముగ్గులేసి వెళుతుంది
ఎందుకంటే....
రేపటి జీవిత సమరానికి విరామం నిద్ర అని
ఆ నిద్రకు వేదిక నులక మంచమని
 ఆ వేదికను అలంకరించమని
ఆకాశమే చుక్కలను పంపి
ముగ్గులు పెట్టమని ఆదేశించింది
నులక మంచం మీద నిద్రపోతే
అమ్మ ఒడిలాంటి ఆత్మీయత
ప్రతిరోజు నిన్నటి రాత్రి జ్ఞాపకాలు
అనుభవాల వర్తమానంలోనికి పరుగులు
తీస్తూ ఉంటాయి
అందుకే పేదవాడి నిజమైన నేస్తం
అదే.... నులక మంచం

****

4. గెలుపు – ఒక మలుపు

మానసిక ఆరోగ్యానికి
అసలైన ఔషధం ..మనోధైర్యం
ఆత్మవిశ్వాసమే.. సిసలైన మందు
మూఢనమ్మకాల మాయ మత్తులో పడి
మనిషి చిత్తవుతున్నాడు..!
శాస్త్రీయ దృక్పథాలను వదిలి
ఆందోళనలో అభివృద్ధిని కోల్పోతున్నాడు
ఒత్తిడిని ఓడించి - ఓర్పును గెలిపించే
ఆలోచన మనిషికి రానంత వరకు
మనిషి గతి ఇంతే - మనసు బతుకు అంతే
మార్పు రాదు అంతే ..
మనిషి మనో సంకల్పమే ఆయుధమైతే
ప్రగతి పురోగతి వికసించి
నూతన క్రాంతి తేజస్సుతో
నవ సమాజం అవతరిస్తుంది
ఇది తెలుసుకుంటే చాలు
మనిషికి ఎంతో పురోభివృద్ధి

మూర్ఖత్వాన్ని వదిలేసి
మానవత్వాన్ని చాటుతూ
మమతా సమతలతో ముందుకు సాగుతూ
మార్గదర్శిగా భావితరాలకు నిలుద్దాం..!
సమస్యలను ఆలోచనలతో ఓడించి
గెలుపులను ఆనందంగా ఆస్వాదించి
గెలుపుని ఒక మలుపుగా తిప్పుదాం..!!

5. నడకలో... నడత

సవాళ్లతో నిండినదే - ఈ మానవ జీవితం...!
గెలుపోటముల సమ్మేళనమే - ఈ జీవన పోరాటం
నిరాశ నిశీధిలో జీవితాన్ని గడపక
ఆశల వెలుగులో నడిపించేదే
నిండైన, నిజమైన జీవితమే మానవ జీవితం
వ్యక్తి జీవితంలో విజయాలు, విలాపాలు
కీర్తికి సోపానాలుగా మలుచుకుని
ముందుకు సాగుతాడు.. మనిషి
ఆ ముందుకు సాగే నడకలోనే
నడత మారకుండా చూడటమే వ్యక్తిత్వం..!
బలహీనతల ఉచ్చులో పడకుండా
కోరికల వలయంలో చిక్కుకోకుండా
సత్య ధర్మాలను, నీతి నియమాలను విడనాడకుండా
విమర్శలకు కృంగిపోక పొగడ్తలకు పొంగిపోక
నీ నడకకు, నడతకు
మలినం అంటకుండా చూడడమే
జీవిత పరమార్థం..!
మనిషి నిజమైన ఆనందానికి
ఆటంకం కలిగించేది ఏమిటో అన్వేషించు..!!
అవరోధాలను అధిగమిస్తూ

అందలం ఎక్కించే సాధనాలు ఏమిటో
ఎప్పటికప్పుడు సరి చేసుకుంటూ
ముందుకు దూసుకుపోవటమే
నిజమైన నడక
ఆ నడకకు అసలైన నడత ఉండేలా చూసుకోవటమే
మనిషి ఏకైక లక్ష్యం...
ఆ లక్ష్యాన్ని విస్మరించకండి..!!

6. భయానికి... భయపడకండి

నిశ్శబ్ద రూపంలో నిలువెత్తు తాపమై
తనువంతా చుట్టేసి,
దేహం లోపల దడ పుట్టించి
తరిమి కొట్టి పిచ్చి వాడిని చేసేదే భయం
ఆ భయానికి భయపడకండి..!
లోపల అంతా అలజడితో ప్రారంభమై
ఎగసి పడే ఓ రహస్య కెరటం
ఒకటి పోరు చేసి, నీతో నిన్ను కలబడనివ్వమంటుంది
విజయం వైపు కాక అపజయం వైపు
అడుగులు పడేలా చేస్తుంది – అదే భయం.. !
కాబట్టి ఆ భయానికి భయపడకండి
భయానికి భయపడకుండా
బలంగా ముందుకు నడవటం ఎలాగో నేర్పేదే ధైర్యం
భయం అనే మహమ్మారి వలలో చిక్కుకొని
కోరలు తీసిన పాములా
ఒంట్లో ధైర్యాన్ని అంతా తీసేసుకుని
అడుగు ముందుకు పడనివ్వదు.
ఎంతటి కాకల తీరిన యోధులుకైనా
ఏదో ఒక సందర్భంలో తప్పని తిప్పలే
భయం .. భయం

భయానికి భయపడకుండా ముందుకు సాగటమే
జీవనం, జీవితం, దిశా నిర్దేశం
భయం మనిషికి ఏదో రూపాన దరిచేరవచ్చు
నేటి సమాజంలో
నయవంచన, మోసపూరితమైన
దోపిడీ వ్యవస్థలో దాగి ఉంది భయం
అందుకే మానవ సంభాషణలో
భయాన్ని పెంచే మాటలు వద్దు
ధైర్యాన్ని మేల్కొలిపే మాటలే ముద్దు
అందుకే అందరికీ కావాలి
భయాన్ని చంపేసే ధైర్యం కావాలి
భయానికి – భయపడకండి
భయం నీడను వీడండి
ధైర్యం ఒడి చేరండి ..!!

****

7. కాలమే ... సమాధానం

సంపాదనే ధ్యేయంగా
బతుకుతున్న వాడికి
రక్తసంబంధం, స్నేహబంధం విలువలు
పలచనగానే కనిపిస్తాయి మరి..!
తనువులో నిలువెల్ల విషం, స్వార్థంతో నిండి పోయి
పెదవులపై మాత్రం
నడయాడే ఖర్చు లేని మాటల మూటలతో
కృత్రిమ ప్రేమను పంచటం అలవాటుగా మారింది
ఆత్మాభిమానం, వ్యక్తిత్వం ఉన్న వారు
కష్టాలు, ఇబ్బందులు పడాల్సిందే
ముందు నీతులు చెప్పి వెనక గోతులు తీసే వారికి
కాలం తాత్కాలికంగా కలిసి వచ్చినా
వారి ఆనందానికి అవధులు అంతంత మాత్రంగానే ఉంటాయి
కానీ అదే కాలం ...
అంతలోనే కఠినంగా మారి శిక్షిస్తుంది
అనే వాస్తవాన్ని తెలుసు కోలేరు
దోచిన సంపాదనతో విర్రవీగితే
దరిద్రం మన పిల్లల పాలిట శాపం అవుతుంది..!!
ఇది కాదనలేని సత్యమే..
ప్రతి తప్పుకు శిక్ష తప్పదేమో..

కష్టానికి సంతృప్తి, సమయం, విలువలు ఎక్కువ
అక్రమాలకు అంతః సౌందర్యం లేని
ఆర్భాటాలు ఎక్కువ
పరిస్థితులు ఎప్పుడు ఒకేలా ఉండవు సుమా..!
కష్టపడ్డ వారికి
సాయం చేసిన వాడికి
కాలం కలిసి వస్తుంది
ఇది అక్షర సత్యమే..
పైకి ఆర్భాటంగా ప్రేమగా కనిపించినా
సమయం వచ్చినప్పుడు
అసలైన అంతరంగమనే తరుగును
సమాజమే బయలు పరుస్తుంది..!
ఎదుటి వాడిని ప్రశ్నిస్తున్నావు సరే
నీ అంతరాత్మ నిన్ను ప్రశ్నించదా?
వడగాల్పులు జీవితంలో వీస్తున్నాయి
ఏదో ఒక రోజు వెన్నెల శాశ్వత ముద్ర వేస్తుంది
అప్పటిదాకా ఓపిగ్గా ఆగాల్సిందే..
వినయంగా ముందుకు సాగాల్సిందే ..
అదే జీవితం.. కాలమే ....
సమాధానమై మన ముందు నిలుపుతుంది

****

8. అగ్ని కిరీటం

సాహితీ క్షేత్రంలో
సువిశాల కవితా పంటను పుడమిలో
కలమనే హలంతో
సేద్యమునెంతో చోద్యంగా
సాధ్యమయ్యేటట్లు చేసి
నవ యుగానికి
నవ్యమైన నడకనెంతో ఓర్పుగా నేర్పి
నవయుగ కవితా చక్రవర్తి వయ్యావు..!
వినుకొండలో జనియించి
విద్యలెన్నో వినయంతో నేర్చి
పద్య గద్యాలతో పండిత పామర
జనులను జాగృతి పరిచి
జనరంజక కవిగా
విశాల హృదయాన్ని చాటి
కవితా విశారధుడవు అనిపించుకున్నావు..!!
పేదరిక, కుల మతాలు
గురువులుగా ఎంచుకొని
ఒకటి సహనం నేర్పుగా
మరొకటి ఎదిరించే శక్తిని పెంచింది..!!
అగ్ర వర్ణ దురహంకారాలను చవి చూచి

ఆనాటి అననుకూల స్థితిగతులను
అవగాహనతో, సౌమ్య పదజాలంతోనే
కవితా సుక్షేత్రంలో పసిడిని పండించిన
విశ్వ కవి సామ్రాట్టువు నీవు..!!!
హరిజనులుగా అణగారిన వారిలో
చైతన్య స్ఫూర్తిని రగిలించిన
స్ఫూర్తి ప్రధాతవై వెలిగి
ఆగామి యుగంలో
దళిత సూర్యుడి శిరస్సులో నుంచి వెలిగించిన
అగ్ని కిరీటం మీ 'గబ్బిలం' అని రూఢి చేసి
దుష్ట సమాజం మీద
ప్రళయం నృత్యం చేసే
విశ్వనరుడిగా ఎదిగావు..
మట్టి కుండలో పుట్టిన ఓ దళితకుండా
నీవు తెలుగు తల్లి మెడలో వాడిపోని పులదండా

****

౯. తెలుగు భాష పై ధ్యాస

వెన్న కన్నా మెత్తినది - మల్లె కన్నా మత్తైనది
తేనెకన్నా మధురమైనది
మన తెలుగేనన్న
అమ్మ పాల రుచుల
అక్షరాల తెలుగు
పసి పెదాల మాతృభాష తెలుగు
మాతృభాషలో మమత మరిచిన జాతి లేదు
మరిచిన జాతికి ప్రగతి గీత లేనేలేదు ..!
దేశ భాష లందు తెలుగు లెస్స అంటే
నా తెలుగు జాతికి వెలుగు రేఖ అనుకున్న
తెలుగు భాషపై ధ్యాస అంటే
అది నీ ప్రగతికి జీవన రేఖ అనుకున్నా
కానీ – పరభాషపై ధ్యాస అంటే
అది మాత్రం నీకు ఒక మాయని మచ్చ అని తెలిసింది
మమతానురాగాలు పంచే మాతృభాషపై
ఎందుకో కొందరికి మమకారం తక్కువ
ఎక్కడి నుంచో వచ్చిన

పరభాషపై మక్కువ ఎక్కువ ఎందుకో?
అందులో ఉన్నది ఇందులో లేనిది ఏముంది?
ఒక్క నీ భ్రమ తప్ప..!
నేర్చుకో మాతృభాషలో ఉన్న మమకారం
తరిమికొట్టు పరాయి భాషలో ఉన్న అపకారం
తల్లి పాల వంటి మాతృ భాష నేర్చుకో
ఇందులోనున్న తియ్యదనం
అందరితో పంచుకో
జై తెలుగు - జై జై తెలుగు సదా వెలుగు..!!

10. జీవ వైవిధ్యం

ప్రకృతి వినాశకారి ఎవరు?
ప్రకృతి చేత ప్రసాదించబడిన
జీవామృతాన్ని, జీవ వైవిధ్యాన్ని
నేడు...
మనిషి యంత్రంలా మారి
యథేచ్ఛగా నాశనం చేస్తున్నాడు ఎందుకో?
మానవుని సౌఖ్యం కోసం
జీవ జాతి గొంతు నులిమి
గోరీ కడుతున్నాడు ఎందుకో?
మితి మించిన విజ్ఞానం
మతి చెడిన అజ్ఞానంగా మారి
ప్రగతిని పాతిపెట్టి
వనాలను, వనరులను తగల బెట్టి
పల్లె పచ్చని పసిడి పంటను
పాతాళ లోకానికి తొక్కిపెట్టి
అడవి తల్లి అందాలను అదృశ్యమయ్యేలా చేసి
ఎడారిగా మార్చినాడు
మానవత్వం లేని నేటి మానవుడు..!
జంతుజాలం జీవ హింసకు
పట్టం కట్టిన మానవుడా

మారణ హోమంలో
మగ్గుతున్న జీవాల పునరుజ్జీవనం ఎప్పుడో?
అణగారిపోతున్న ఓ మనిషి..!
ప్రకృతి మనకు
 నవీన నాగరికత నేర్పదా!
నిజమైన బ్రతుకు ఏమిటో చెప్పదా!!
అందుకే .... ఓ మనిషి
బ్రతుకు... బ్రతికించు ..
జీవ వైవిధ్యమైన జీవరాశి సంతతిని బతకనివ్వు

****

11. గురజాడ నీవు - మాకు అడుగుజాడ

తేట తెలుగుకు సానబట్టి
అక్షరాలన్నీ కూడగట్టి
యుగయుగాలు పాడుకునే
విశ్వ గీతమొకటి పాట గట్టి
ఘనత గాంచిన గురజాడ
నీవే మాకు అడుగుజాడ..!
మానవ శ్రేయస్సు అనే
కావ్య రాజములు రచించి
వేగుచుక్క వలే వెలుగొందిన మహాకవి నీవు
దేశమును ప్రేమించుమని
దేశభక్తిని చాటుమన్న
నీ పలుకులు విశ్వజనీనములు..!
ఓ నవీన యుగ
చైతన్య స్ఫూర్తి ప్రదాత
సాంఘిక విప్లవ సమరయోధుడా!
రాబోయే నవతరానికి ఆదర్శప్రాయుడా!!
మీ కన్యాశుల్కం నాటకం మార్పును కోరింది

మీ దిద్దుబాటు నవల
సమాజానికి కొత్త ఒరవడిని నేర్పింది
మీ ముత్యాలసరం ఛందస్సు
తెలుగు పద్యానికి నవ్య నడకను నేర్పించిన
నీవు అజరామరుడవు..!!
మీ సాహిత్యం ఆచంద్ర తారార్కం
అందుకే మీరు నవయుగ వైతాళికులు

12. అరవది ఏండ్ల పండుగ

క్రమశిక్షణకు పట్టుకొమ్మగా
కట్టుబాటుకు చెరగని ముద్రగా
సర్వమత సమైక్య భావాన్ని పంచుతూ...
సర్వసమాన ఐక్యమత్యాన్ని చాటుతూ...
మునుముందుకు పోతుంది మన లొయోల పాఠశాల..!
సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతూ...
క్రీడల ప్రాధాన్యతను పెంచుతూ...
ప్రగతి పథంలో పయనిస్తూ
మునుముందుకు పోతుంది
మన లొయోల పాఠశాల..!!
అదిగో అరువది ఏండ్ల పండుగను తెస్తుంది..!
అది మనకెంతో ఆనందాన్ని పంచుతుంది..!!
కొత్త పుంతలు తొక్కుతూ
కాంతి రెక్కలు తొడుగుతూ
షష్టిపూర్తిని నింపుకొని
నిండుగా ముస్తాబవుతూ
మనకందరికీ వెలుగును పంచుటకై రానే వస్తుంది
తొందరలోనే వస్తుంది
అదే మన అరవది ఏండ్ల పండుగ
మన కళ్ళల్లో నింపును వెలుగును మెండుగా

****

13. గురువు - నిత్య పూజ్యులు

గురువు అంటే గుండె బరువును దించి
విజ్ఞానాన్ని పంచేవాడు
గురువు బ్రహ్మచే మలచబడి సృష్టించబడినవాడు
అతడు విష్ణువై
జ్ఞాన సమపార్జన పొందిన వాడు
అతడు మహేశ్వరుని నుంచి
సర్వశక్తి పరాక్రమ తేజస్సు పొందినవాడు
తల్లిలాంటి....
ప్రేమ, ఆత్మీయత, అనురాగం కలిగిన వాడు !
తండ్రి లాంటి
లాలన, పాలన, సుతి మెత్తని దండన కలిగిన వాడు !!
అతడు పుట్టుకతో మనతో కలిసి మెలిసి
ఓర్పు, నేర్పు కలిగి, విద్యకు పునాది వేసేవాడు
తాను నిత్యం జ్ఞానం పొంది
వెలుగు దీపం అందించు వారధి
మన అభివృద్ధికై
నిరంతరం తపన పడే సోపాన సారధి
ఆప్యాయత, అనుబంధాలకు మరుపు రాని

మహోన్నత మారుపేరు గలవాడు
శిష్యుడనే విత్తును
తన సత్తువ అనే క్షేత్రంలో నాటుకొని
బంగరు పంటను పండించే
నిత్య కృషీవలుడు గురువు
కనుక గురువు నిత్య పూజ్యుడు - నిత్య స్మరణీయులు

****

14. మహిళా మణి

మహిళా మణి.!
సంస్కృతి సాంప్రదాయాలకు నీవేగా నిలయం
నా భారతదేశం సాంప్రదాయ అలవాట్లకు నిర్దేశం
మీదేగా ఈ అవని
పన్నీరైనా కన్నీరైనా
మీ కరుణలోనే కదా తరుణి
తల్లివైనా, చెల్లివైనా, నెచ్చెలివైనా
వెచ్చని నీ కరవరములకే కదా పడతి!
నీ స్పర్శ లేక పుడమి పులకించదు
పైరు పచ్చలు కూడా మీ చేయి లేనిదే సిరులు పలికింపవు !
మీ సున్నిత కర స్పర్శములు లేకుంటే
పురుష హృదయ వీణియలు మూగబోవును
మీరు మాలో అర్థయే కాదు
మీరు లేని మా బ్రతుకుకు అర్థమే లేదు
నీవు ఆదర్శం అందరికీ
కుటుంబ బాధ్యతతో మల్లె పందిరిలా అల్లుకుపోతూ
ఆదర్శంగా నిలుస్తావు
బంధాలను కలిపే వారధి అవుతావు
అనురాగాలను పంచి

కంటి చెమ్మను తుడిచే అమ్మవు
దేశాభివృద్ధిలో నిరంతరం
తరం తరం చెప్పుకునే పాత్ర నీది
 నీ రుణం ఎప్పటికీ తీరనిది
నీ కీర్తి ఎంత చెప్పినా తనివి తీరనిది
ఓ మహిళా మణి - అదే నీ గొప్పదనం
ఎప్పటికీ తీరనిది – అదే నీ ఋణం

****

(వ్యాయామ ఉపాధ్యాయుడు గౌరవనీయులు **శ్రీ పసల జోజయ్య** గారి ఉద్యోగ విరమణ సందర్భంగా – 30-11-2019)

15. చిరు కవితా అక్షరమాల

ఆరడుగుల ఆజాను బాహుడవై
అరవింద నేత్రములను నొసగి
చీకటి బతుకులకు భరోసానందించే
వెలుగు రేఖల రవికిరణమతడు
నీలి మేఘ ఛాయను పోలి
నిండైన సొగసుతో సరితూగునితడు..!
లోకపు రీతి పోకడలను
విద్యార్థులకు విపులంగా, విడమర్చి చెప్పగల
కమనీయ వాగ్దాటి వారు
వారి మాటల తీరుకు ఎందరెందరు బారులు తీరును
వీరు తెలియని వారు ఇలలో లేరు
వ్యాయామ విద్యతో
విద్యార్థులకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తూ
శారీరక దారుఢ్యానికి మెలకువలు నేర్పుతూ
వారు సాధించే ప్రతి గెలుపు
వారి కఠోర శ్రమకు ఒక మలుపు
వారు అందుకునే బహుమానాలు
వారి వృత్తిని తూచే కొలమానాలు
వీరు చిందించే చిరునవ్వులే

విద్యార్థులకు చల్లని దీవెనలు
వీరి శిక్షణలో పాఠశాలకు క్రమశిక్షణ ఉంది
వీరు ఊదే పీక శబ్దంలో నిశ్శబ్ద వాతావరణం ఉంది
వీరి చల్లని మాటల ఓర్పులోనే
క్రీడలకు శిక్షణనిచ్చే నేర్పు ఉంది
మధ్యాహ్న భోజనాన్ని మన్నికగా మలిచి
ఆత్మీయతతో కమ్మని విందుగా
విద్యార్థులకు అందిస్తారు
మ్యూజికల్ కీబోర్డును
రహస్య రసరమ్యంగా మీటి
రాగాలాపన చేయగల రసజ్ఞులు మీరు
అందుకే కవితాత్మక కళా హృదయమున్న
ఓ బహుముఖ ప్రజ్ఞాశాలి
నీవు మా అందరికీ స్ఫూర్తి
అందుకేనేమో నీకింతటి ఘన కీర్తి
గాలమేసి పట్టినా దొరుకునా
నీవంటి ఘనులు మాకు
నేడు మీ పట్ల ఉపాధ్యాయుల అభిమానం
అలలై పొంగి పారిన ఈ వేళ
విద్యార్థుల మది పులకించే గదా - కేరింతలతో చేసిన ఈ గోల
అందుకోనుము ఈ చిరు కవితాక్షర
సన్మాన కుసుమాల మాలిక

****

(గౌరవనీయులు **శ్రీమతి జొన్నలగడ్డ లూర్దు మేరీ** గారి ఉద్యోగ విరమణ సందర్భంగా సమర్పించుకొనుచున్న చిరు కవిత)

16. ఉత్తమ ఉపాధ్యాయిని

ఉత్తమ ఉపాధ్యాయ నమో నమః
అక్కడెక్కడో గ్రామాన పుట్టి
విద్యాబుద్ధులు ఎంతో వినయంగా చేపట్టి
వృత్తులన్నిటిలో కెల్లా
ఉత్తమోత్తమమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి
రాబోయే తరానికి మూల స్తంభాలైన
ఎందరో భావి బాల పౌరులకు
అక్షర భిక్షను అందించిన ఆదర్శ మూర్తులు..!
అజ్ఞానపు తిమరంలో అలుముకున్న వారికై
విజ్ఞానపు వెలుగులు విరజిమ్మాలనే తలంపుతో
జీవశాస్త్ర బోధన పాఠ్యాంశాలతోనే
విద్యార్థుల జీవితాన వెలుగులు నింపి
కాంతి రేఖ దీపాలు వెలిగించి
ఈ సమాజానికి అందించిన సాధ్వీమ తల్లి..!!
అక్షరాలతో పాటు

సులక్షణాలను లక్షణముగా నేర్పి
38 వసంతాలుగా నిర్విరామంగా
అలుపెరగని ఆరాటాన్ని పోరాటంగా మలుచుకొని
సేవలందించిన మహిళామణి మీరే..!!!
ఇన్ని సేవలు అందించారు కనుకనే
ప్రభుత్వం మిమ్ము
ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి ఎంపిక చేసింది
ఎంతటి వారికైనా తప్పదు ఉద్యోగ విరమణ
ఇది ప్రభుత్వం పెట్టిన విధి నిర్వహణ
మీ విశ్రాంత జీవితం ప్రశాంతంగా
దైవానుగ్రహ సన్నిధిలో జీవించాలని ఆశిస్తూ ఆకాంక్షిస్తూ
ఉపాధ్యాయిని నమో నమః
స్వస్తి

****

17. సన్మాన చిరు కవితాక్షరమాల

వయసు మీరిననూ వన్నె తరగనట్టి
పసిడి వర్ణ ఛాయను పోలు
పాల బుగ్గల బాల సుందరుడా....
మల్లవరపు వంశాన
మచ్చలేని అచ్చమైన మణి దీప కిరీటమా!
అందుకొనుము ఈ సన్మాన సంబరం నడుమ
కోలాహాలాల మధ్య కొసరి కొసరి అందిస్తున్న
ఈ కొద్దిపాటి చిరు సత్కారమును
చిరు దరహాసముతో స్వీకరించుమా!!
కథోలికలకు కాణాచియై
పరమార్థతకు పట్టుకొమ్మై
గురు పుంగవులకు పుట్టినిల్లై
మమతా వనితలకు మెట్టినిల్లై
అలరిన అది ఆర్చి బిషప్ తోమస్ పొతకమూరి వారికి
నిలయమైన అడ్డా
అదే మీ రావిపాడు గడ్డ
అందు జన్మించిన బిడ్డే
మన ఈ బాల సుందరాంగుడు
నామానికి తగినట్టే బాల (బాలుడిలా)
సుందర (అందముగా)

చూపురులకు సృష్టిగా, పుష్టిగా
అగుపించు మీ రూపం ఎంతో అపురూపం
మీ నవ్వు తెల్లని వెన్నెల కర్పూరపు బిన్నెలు
మీ మాటలు పదునైన తూటాల మూటలు
మీ చలువ చూపులు
కలువ పూల రేకుల సముదాయపు నీడలు
నీ నడకలు కొదమ సింహపు ధీటుల అడుగుజాడలు
మీరు నవ్వితే ఆ నవ్వు వెన్నెలను ప్రకాశింపజేసినట్లు
తలపించును
కారణం వెన్నెల రంగు - నీ నగుమోము రంగు తెలుపేనని
కాబోలు అలా అనిపించును
మీతో సంభాషణ అంటే
అది ఒక హాస్య చదరంగ క్రీడ
జరంత జాగ్రత్తగా లేకున్నా
ఎంతటి ఘనులైనా సరే
మీ మాటల తూటాల ముందు చినబోవాల్సిందే
అంతటి గాత్రమున్న ఘనాపాటి కాబట్టే
ఉత్తమమైన ఉపాధ్యాయ వృత్తిని చేపూని
అందునా జనులను శాసించే జాతీయ భాషపై
మక్కువ, మమకారాలను
ఆశల అభిరుచిని అలవరచుకొని
లేత పసి మనసులకు
విద్యా సుగంధ పరిమళ సొగసులద్దిన మీ కీర్తి

వెన్నెల వలె, కర్పూరపు దివ్వెల వలె
దిగ్దేశములను మిన్నందింది
వన్నెకెక్కిందని మా భావన
విన్నావా? "హిందీ మాస్టర్"
అలాంటి మిమ్ములను నాటి నుంచి నేటి వరకు
అందరు పిలిచే పిలుపు
చెవులకింపుగా చిన్న హిందీ మాస్టారు అని
అది మాతో పాటు మీకు కూడా ముదావహమే కదా
ఇన్ని సులక్షణములు ఉన్న విలక్షణమైన మీరు
మాకు అనుబంధమై
చెరగని గంధమై
తరగని నిధిలా మా మదిలో నిలుస్తారని
ఈ విరమణ సమయాన
మాకు అనిపించి మీకు వినిపిస్తున్నాం
ఇది ఒక చమత్కార సత్కారమని
తెలుపుతూ మీకు అందిస్తున్నాం

****

(గుంటూరు పీఠాధిపతులు మహా పూజ్య శ్రీ శ్రీ **శ్రీ చిన్నా బత్తిన భాగయ్య** గారు సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలకు మొదటి సారి వచ్చిన సందర్భంగా ..)

18. చిరు కవితా అక్షరమాల

పీఠాధిపతులై ప్రథమ వార్షికోత్సవమును
పూరించినట్టి పూజ్యులారా
మీకు జయము జయము!
పరిశుద్ధ ప్రవచనాలు పలికించుటలో
సృజన సూన్రూతులు
మీకు శుభమ్ శుభమ్ ..!!
తొలిసారి గుడి వంటి మా బడికి విచ్చేసిన
పవిత్ర పావన ఏలిన వారా
మీకు స్తుతులు స్తుతులు..!!
ఫిరంగిపురం నందు కథోలిక విశ్వాసులకు
ప్రీతి పాత్రులైనట్టి మాన్యులారా
మీకు మంగళమ్! శుభ మంగళమ్..!!
పేరు పొందే భాగ్యశీలియను
మేత్రాసనమున మేటిగాను
దైవ వాక్కుల బోధయే గాక
గీత రచయితై వాసికెక్కు

భాషితాలను తమదైన బాణిలో పలికించి, పులకింపచేయు
మీ మధుర గాత్రమునకు
ఎవరైనా మంత్రముగ్ధులై
మోదముతో అలరుచుండెను
మీ దైవిక నాయకత్వ పాలన
గుంటూరు మేత్రాసనములు మూడు పువ్వులు ఆరుకాయలై
నిత్యం వర్ధిల్లాలని
ప్రభుని ప్రేమ సన్నిధిలో
సేద తీరుతూ మీ కీర్తి నలుమూలలా విస్తరించి
ఆచంద్రార్కమై జయ కేతనం ఎగరవేయాలని
దేవుని ప్రార్థిస్తూ - వినయ విధేయతలతో
మీకు అందిస్తూ....

****

19. శాంతి ప్రయాణం

విత్తును బట్టి ఫలం
జ్ఞానాన్ని బట్టి గమనం అన్నట్లుగా
కేవలం మానవుని మనుగడ కోసం
ఎన్నెన్నో యుద్ధాలను, హింసలను సృష్టిస్తాడు
జీవ కారుణ్యంలో జీవుడుగా ఉంటూనే
రామ అంటూనే రాక్షసుడుగా ప్రవర్తిస్తున్నాడు
అహింసను గురించి వివరిస్తూ
హింసను వదలను అంటాడు
మనిషిగా ఎదుగుతూనే
మత కల్లోలాలను సృష్టిస్తాడు
మానవత్వాన్ని, మమతానురాగాలను మైమరిచిపోతున్నాడు
మనిషి విజ్ఞానంతో వెలుగు చూసిన
పరిజ్ఞానమే నేడు అజ్ఞానంగా మారి
అనంత లోకాలకు శాపమైనది...!
లేకుంటే బాంబులతో భూమిని ఎందుకు భస్మం చేస్తారు
కత్తులతో నెత్తురు సెలయేరును ఎందుకు పారిస్తారు
నానాటికి అన్యాయాలు, అక్రమాలు ప్రభలుతుంటే
నానాజాతి సమితి అని, ఐక్యరాజ్య సమితి అని
దేశ దేశాల మధ్య సంబంధాలను పెంచుతుంటే
బంధాలను, అనుబంధాలను తెంచుకొని

హాని కలిగిస్తూ హీనునిగా హీనమైపోతున్నాడు
కనుక కోరికలనే బరువును తగ్గించు
శాంతి అనే రైల్లో హాయిగా ప్రయాణించు
మితిమీరిన ఆశలు మనిషికి
మతి చెడిన ఊహలు రేపి
గతి లేకుండా చేస్తాయని గమనించు
మతం కన్నా మానవత్వం మిన్న!
 మానవత్వం లేని మతం సున్నా!!
మత పిచ్చితోను, కుల పిచ్చితోను, ప్రాంతీయ పిచ్చితోను
మానవత్వానికి మలినం అంటించవద్దు
అందుకే
ప్రేమ తత్వం పెంచండి..!
రాక్షసత్వం తుంచండి..!!
అరాచకత్వం అణచండి..!!!
సాత్వికత్వం పంచండి..!!!!

****

20. వరలక్ష్మీ వ్రతం

పంట చేలో తోలే పైరుగాలిలా
తొలిప్రొద్దు వేకువ జామున
సుప్రభాత గీతంలా
మలి సంధ్య సమయమున
లేత అరుణ కిరణమై వెలుగులా
తామరాకుపై ఉలికి పోయే మృదువైన నీటి బిందువులా
నిండు పున్నమి వెన్నెల జాబిల్లిలో
విరబూసిన బొమ్మలా
ఎంత అందంగా ఉన్నావో ముద్దుల గుమ్మ
అప్పుడే తీసిన వెన్నపూసలా
నిండు జాబిల్లి కూడా నిన్ను చూసి నివ్వెరపోయేలా
పచ్చని పాలకంకిలా
లేత తమలపాకులా
నవనవలాడుతూ అలంకరణకు అలంకారమయ్యావు
ఈ వరలక్ష్మీ వ్రతం నాడు
మిలమిలా మెరుస్తున్న
నీ మేను సొగసుల ఎరుపు నునుపుల మెరుపులు
నక్షత్రంలో కూడా ఉండబోదేమో
వరలక్ష్మీ వ్రత పర్వదినం నాడు

సిరులు కురిపించు మహాలక్ష్మిలా
వెలుగు కాంతులు ఈనుతుంది చూడు
ఈ నగుమోము
మీ పసిడి వర్ణం ముందు
మీ మెడలో పసిడి ఆభరణం కూడా చిన్నబోతుంది చూడు
ఆత్మీయతకు తప్ప అహంకారానికి చోటులేని
మీ మంచి మనసు గురించి
ఎంత చెప్పినా తక్కువే అవుతుంది తప్ప
అది మీ ప్రతిభ సంపత్తిని కొలిచే
గీటు రాయి మాత్రం కాదు సుమా

****

(మహిళా దినోత్సవం సందర్భంగా 8-3-2021)

21. స్త్రీ లేని లోగిలి
నిర్వీర్యమై పోయిన వాకిలి

అమ్మా.. ఓ మహిళామణి

తల్లి గర్భం నుండి భువిని తాకగానే

భూదేవికి తోబుట్టువు అయ్యావు.

సహనానికి సహచరివి అయ్యావు.. - !

కేర్ మని ఏడ్చినప్పుడే

అనుకున్నావేమో.....

ఈ కష్టాల కడలిని కన్నీళ్లతో ఈదాలని

పసిడి కన్నులు తెరచి

ఈ లోకాన్ని చూశాక

ప్రకృతి అందాలన్నీ

నీలోనే పొదువుకున్నట్లు ఉంటుంది

తారలోని తళుకులు అన్నీ

నీ నవ్వులై వెన్నెల పూసినట్లు ఉంటుంది

అందుకే అంటారు......

నీవు లేని లోగిలి నిర్వీర్యమై పోయిన వాకిలి అని

వీచే పచ్చని పైరుగాలి

నీలోని చైతన్యానికి పలుకుతోంది ఓ నివాళి

అది పలుకుతోంది ఈ వేళ

విశ్వగతికి మహిళా దినోత్సవ

తోరణాలతో నీరాజనం పడుతుంది

నీ ప్రగతికి ఈ జగతికి

సముద్రానికైనా ఎదురీది

సంసార సాగరాన్ని సుభిక్షం చేయాలన్నా

అది నీకే చెల్లు – నీవు లేనిదే

ఈ సమస్త లోకమే స్తంభించి పోవును కదా ..!

****

22. గురువులారా ! వందనం.

బ్రహ్మ లోకం నుండి

మా ఈ బడికి వచ్చిన

గురువులారా ! వందనం !

పరబ్రహ్మలారా మీకు అభివందనం

గురు బ్రహ్మ అంటూ గురుర్విష్ణుయని

గురుర్దేవో మహేశ్వరయని నుడివి

ముల్లోక త్రిమూర్తుల బింబమై

సంఘ సంస్కర్తలై మాకు దారి చూపుతారు

సూర్య భగవాను తేజస్సు లాగా

మాకు వెలుగులను పంచుతారు

కాంతి కిరణాలై కాంతి పుంజాలై

అజ్ఞానాంధకారాలను మా నుండి పారద్రోలి

క్రొంగొత్త జ్ఞాన దీపికలను వెలిగిస్తారు

మేధో మదనం మీరు చేసి

ఆసారమంతా మాకు పంచి

సంఘంలో జాతి నిర్మాతలుగా

మమ్మల్ని తీర్చి దిద్దుతారు

నిస్వార్థంతో మీరు నిత్య శిల్పులై

మమ్మల్ని సజీవ శిల్పాలుగా మలుచుతారు

భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది

ఈ దేశానికి భద్రంగా అందించే

బరువైన బాధ్యతను మీరే తీసుకుంటారు

బ్రహ్మ లోకం నుండి మా బడికి

వచ్చిన గురువు లారా వందనం --!

పరబ్రహ్మలారామకు అభివందనం---!!

****

23. కవితే నాతోడు

కవిత

నన్ను నిత్యం పలకరించే

నిత్య శ్రోత

కలాన్ని చేత పట్టి

కవిత్వాన్ని రాయబట్టే

భావం ఉట్టిపడుతుంది

కవిత నా వెంటబడుతుంది

భావం మనసుకు వంట బడుతుంది

బహుశా ఇదేనేమో !

కలానికి కవిత్వానికి

భావానికి, మనసుకు ఉన్న

అవినాభావ అనుబంధము

ఎంత కవిత్వము రాసినా

తనివి తీరనిది ఆ అక్షర అనుబంధం

అక్షరాల అందానికి భావాల ముడి వేసి

అల్లుకుంటూ పోయే జడ లాంటిది కవిత్వం

పదాల పరిమళాలను

వాక్యాల సోయగాలకు అద్దితే

అదే సుస్థిరమైన కవిత్వం.

పది మంది హృదయాలను

కదిలించే కమ్మనైనది కవిత్వం

ఆ కవిత్వమే....

పది కాలాల పాటు పదిలమై

సమాజాన్ని పటిష్టపరుస్తుంది.

****

24. విజ్ఞానపు గని

నిత్య చైతన్య మూర్తి

సమాజానికి మూల స్తంభం

సమ సమాజ నిర్మాణానికి పునాది గురువు.

తరగతి గదిలో అనంత విశ్వాన్ని

సృష్టించే నవ బ్రహ్మ గురువే

గురువు అంటే గుండె బరువుదించి

విజ్ఞానాన్ని అందించే గొప్పతరువు

ఆ తరువుకి ఫలాలు ఇవ్వటమే గాని

తీసుకోవటము అనేది తెలియదు

అందుకే... గురువు అంటే విజ్ఞాన తరువు

విద్యార్థుల పాలిట కల్ప తరువు

రేపటి భావి తరాల వారధి

గంధం చెక్కవలె అక్షర పరిమళాలు

వెదజల్లే అమృత కలశం గురువు

కలతలు ఎన్ని ఉన్నా

కళ చెదరని రూపంతో

అక్షర సత్యమును అందించేది గురువు ఒక్కరే

నల్ల బల్లపై అక్షర వెన్నెలను.

కురిపించే చల్లని రేడు గురువే

కరిగి పోతున్న కాలంతో పాటు

గత చరిత్రకు జీవం పోస్తూ

నవ సమాజానికి నడక నేర్పే నాయకుడు గురువే

అట్టి గురువులను గుండెనిండా నింపుకొని

వారి పాద పద్మములకు అక్షర నీరాజనాలు అందిస్తున్నాను

****

25. తల్లిదండ్రులు

నీవు ద్వేషించినా

ప్రేమించేది అమ్మా--!

నీవు ఏమి ఇవ్వక పోయినా

అన్నీ నీకు ఇచ్చేది నాన్న ---!

నవమాసాలు గర్భంలో

పదిలంగా పెంచిపోషించేది అమ్మా-!

ఆ శిశువుకు

నడక నడత నేర్పి

నవ సమాజానికి

నాణ్యమైన వ్యక్తిగా శక్తిలా

అందించేది నాన్న..!

బిడ్డ బాగోగులు చూచి

ఆకలి తీర్చే ఆపన్న హస్తం అమ్మయితే ..!

తన కన్న బిడ్డను.

ఎత్తులో నిలబెట్టాలని

బిడ్డ భవితకు

ప్రణాళికలు రచించేది నాన్న అవుతాడు.

చంటి బిడ్డగా నువ్వు ఉన్నప్పుడు

గారాబం చేస్తూ అమ్మ గోరు ముద్దలు .

తినిపిస్తూంటే....

తినక ఏడిపించావు....!

పెరిగి పెద్దవాడివయ్యాక

వృద్ధాప్యంలో నున్న తల్లిదండ్రులకు

అన్నం పెట్టక ఏడిపించావు......!

మొత్తం మీద జన్మనిచ్చిన

దైవ సమానులైన తల్లిదండ్రులను

ఎప్పుడూ ఎడిపిస్తూనే ఉన్నారు !

ఎందుకంటే

ఆనాడు శిశువు ..!

ఈనాడు పశువు--!!

తల్లిదండ్రులపై దయలేనివాడు

ఉన్నా ఊడినా ఒక్కటే...!

అన్నది జగమెరిగిన సత్యం

(కార్తీక పౌర్ణమి సందర్భంగా)

26. నింగిలో నిండు చందమామ

వెయ్యి దీపాల వెలుగులు

ఒక్కసారిగా ఏకమై

వెన్నెలను తోడుగా చేసుకొని

నింగి లోకి ఎగప్రాకి

నిండు వెలుగును నింపుకొని

నింగిలోంచి

తొంగి చూస్తుంది నిండు చందమామ

కార్తీక పౌర్ణమి వెన్నెలను

తనలోనే విలీనం చేసుకొని

వెండి కొండ పగిలి విరజిల్లేనా

కర్పూరమంత నింగికెగసి అలంకరించేనా.

అన్నట్లు సుమధుర దృశ్య కావ్యముగా కనపడుతూ

నక్షత్రాల వెలుగులతో చంద్రోదయం

అద్భుతమై అలరిస్తుంది ఈ వేళ

కలువ పూలకు యవ్వనం వచ్చెనేమో

నెలరాజును చూసి ముఖము విచ్చుకొనే

ఆకర్షించి రెక్కలతో స్వాగతం పలికే

ఈ రేయి తమకు తోడుగా నిలవాలని..

ప్రకృతిలో మార్పులు చంద్రుడికి పలుకుతోంది

ఆహ్వాన తోరణాలతో రమణీయ కాంతులీనే

కమనీయ వెండి వెలుగుల జిలుగులు

****

27. రైతు బ్రతుకు

మట్టిని మెతుకులుగా చేసి

సమాజం ఆకలి మంటను

చల్లార్చే ఆషాఢ మేఘవర్షం రైతు "

నాగలిని అగ్గిలా మండించి

ఆకలి మంటలను ఆర్పి,

బ్రతుకుకు భాగ్యమిస్తాడు రైతు

రైతన్న లేకపోతే మెతుకులేదు

బ్రతుకులేదు సమాజానికి

రైతన్నను కాపాడుకుంటేనే

జనం బతుకులు పంట పండిన భూములౌతాయి

జై జవాన్ జై కిసాన్ నినాదంతో

స్వామ్యం పొద్దు గడుపుతుంది

కానీ రైతన్న బతుకులో వెలుగులు కురిపించే

న్యాయమనే కరెంటు సప్లయి చేయకుండా

పొద్దు గడుపుతుంది.

జనం కళ్ళు తెరచి చేతులు కలిపి

రైతన్నకు అండగా మార్పుకు పోరు సలిపితేనే

రైతన్న బ్రతుకు మన బ్రతుకులు బాగుపడేది

28. అన్నదాత

అన్నదాత బ్రతుకంతా కష్టమే.

దినమంతా యాతనే

దినదినమూ గండమే

వ్యవసాయం సుడిగుండమే...

సంసారం అగ్నిగుండమే..

పేరుకే ఈ దేశం వ్యవసాయాధారం

ప్రతి రైతు క్షేత్రం రణక్షేత్రమే..

పండించే రైతు ప్రతిక్షణం క్షతగాత్రమే....!

పొద్దున లేస్తే విషాద గాత్రమే

అయినా ప్రపంచాన్ని బ్రతికించాలనే ఆత్రమే

కూటి కోసం- కూలి కోసం

ఎరువు కోసం పరువు కోసం

నారు కోసం నీరు కోసం

కష్టమే...అది రగిలే రావణ కాష్టమే..!!

ఏడాది పొడుగునా పడే శ్రమ

ఫలితం ఇస్తుందంటే భ్రమ

ప్రతి రైతన్న వ్యధ. ఓ అంతులేనికధ

వానొస్తే సంబరం

అది వరదగా మారితేనే కలవరం

అప్పు చేసి కొన్న విత్తు

దాని చుట్టూ ఉంది ఓ విపత్తు

వడ్డీ కట్టలేని శాపానికి

పొలం తాకట్టు … నాలుగు రోజులు గడిచాక

ఆ తాకట్టు వాకట్టు.. ఇదే అసలైన అప్పులో నుంచి

తప్పుకోలేని విపత్తు ….!

మొత్తానికి అన్నం పెట్టే అన్నదాతకు

ఈ పుణ్యభూమిలో కష్టాలే కానుక ..

ఇంట్లో పొద్దున లేస్తే ఆకలి కేకలే ఆర్తనాధాలై

చివరికి కూటికి నోచుకోలేక

కాటికి చేరుకుంటున్నాడు.

అన్నం పెట్టే రైతన్నకు

ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయి

అందుకే చేయి చేయి కలిపుదాం

అన్నదాతను కాపాడుకుందాం

****

29. రైతు

వందనాలు వందనాలు రైతన్న

నీవు లేకుంటే లోకమే పస్తులన్నా..

నీ మనసును పెనవేసుకునేది పైరు

పచ్చదనమన్నా

మట్టితో అనుబంధాన్ని వివరించుటకు

మాటలే చాలవన్నా.

పాడిపంటలే - పల్లె సీమకు పట్టు కొమ్మలంటారు

వాటికి తరగని వెలుగే నీవన్నా

స్వేదంతో గింజకు ప్రాణం పోసి

జగతి ప్రాణం నిలిపేవన్నా

వందనాలు వందనాలు రైతన్న

నిత్యం ప్రార్థనా గీతంతో

నిను జాతి కొలవాలన్నా

చదువుల సంతలోన

జాతి మనుగడ లేదన్నా

పాడి పంటల్లోనే – పయనం ఉందన్నా

మాతృ ప్రేమను మరిపించటం

నీ త్యాగంలో వుందన్నా

ప్రకృతమ్మ కరుణకై ప్రతిక్షణం

ప్రార్థనలే చేసేవన్నా

కలల పంటలను సాధించే యజ్ఞ కర్తవే నీవన్నా

కాలగతులకు ఎదురు నిలచి

పచ్చని ఆశయాలతో

లోకాన్ని బ్రతికించేదే నీవన్నా

వందనాలు వందనాలు రైతన్న.

నీవు లేనిదే లోకమే పస్తులన్న

****

30. సత్వర న్యాయం

నిన్న దిశపై జరిగిన

దారుణ కృత్యం దశదిశల ప్రాకి

దేశమంతా నిర్ఘాంతపోయింది

నేడు జరిగిన సత్వర న్యాయం చూసి

యావత్ భారతం సంభ్రమాశ్చర్యాలతో

మునిగి మురిసిపోతోంది

దుష్ట శిక్షణకు రక్షణ ఏదని

తల్లడిల్లిపోతున్న తల్లిదండ్రుల

బరువెక్కిన హృదయాలకు

తక్షణమే న్యాయాన్ని అందించి

మనోధైర్యం నింపిన

రక్షక దళానికి జేజేలు పలుకుదాం....!

తప్పు చేసి తప్పించుకోవచ్చని

అనుకునే వారెవరైనా

సత్వర న్యాయమనే సంకెళ్ల ఉచ్చులో పడి

శిక్షార్హులు కావాల్సిందే అని నేడు రుజువయింది

ఎక్కడ అన్యాయం జరిగినా

ఇదే జరిగి తగిన శాస్తి కావాలి

సంస్కారం లేని కామ మృగాల

ఆగడాలకు ఇదే కళ్లెం వేసి

క్రమశిక్షణలో నడపాలి....!

జరిగింది న్యాయం - రక్షక భటుల సాక్షిగా..!

దిశ ఆత్మకు శాంతి చేకూరింది- దేశం యావత్తుగా..!!

ఇలాంటి సత్వర న్యాయ యజ్ఞాలను

ఈ రోజే కాకుండా

నిరంతరం సాగి

దుష్టుల వెన్నులో వణుకు పుట్టే

మహా యజ్ఞం కావాలి

నిర్భయ ప్రత్యూష తల్లులకు కూడా

సత్వర న్యాయం అందించి

తమ కన్నబిడ్డల ఆత్మలకు శాంతి చేకూరాలని

ఆత్మ రక్షణతో ప్రతి ఆడపిల్ల

అవనిపై ఆనందంగా తిరగాలని ఆశిద్దాం

31. అమ్మకు వందనం!అభి వందనం !!

వందనమమ్మా ఓ జననీ !

అభివందనమమ్మా మా జననీ

పాదాభివందనమమ్మా భారత జననీ ..!

నవ మాసాలు మోసి

నన్ను ఈ భువికి తెచ్చావు

రక్తమును పాలుగా మలిచి

నన్ను పెంపుదల చేశావు---!!

విద్యా బుద్ధులను చెప్పించి

వివేక వంతుడిగా మలిచావు

బిడ్డ భవిష్యత్తును బాగుపరచాలని

ప్రతి నిత్యము శ్రమించావు

అవసరానికి అప్పు చేయుటకైనా.

వెనకడుగు వేయక ముందుకే నడిచావు.

ప్రయోజకునిగా చేయాలని

ప్రతిరోజు పాటు పడ్డావమ్మ

ఈనాడు ఇంతటి వాడిగా

మలిచిన నన్ను...!

ఏమి చెప్పినా తీరదు నీ ఋణము

మనసున నిన్ను నింపుకొని కొలిచెదను

కంటి పాపలా కాచుకొనెదను

చంటి పాపలా చూచెదను

చంటి పాపలా లాలించెదను

ఎన్ని చెప్పినా అమ్మ ఋణము తీరనిది కదా

అమ్మకు అమ్మై పుడితే తప్పా

అది అసాధ్యమా అని తెలిసి కూడా

అడుగుతున్నాము చూడూ... అదే అమ్మ ప్రేమ.

****

చిత్ర మాలిక






తెలుగు
7వ రాష్ట్రస్థాయి
ప్రకాశం జిల్లా




పుస్తక
మహోత్సవము